జగనన్న వెంటే మేమంతా..



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు రంగమ్మ. భర్త, కుమారుడు, కుమార్తెతో కలిసి లేపాక్షి మండలంలోని నాగేపల్లిలో నివసిస్తోంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఈమె కుటుంబానికి నవరత్నాల్లోని పథకాలు ఎవరి సిఫార్సులు లేకుండా అందాయి. వైఎస్సార్ ఫించన్ కానుక ద్వారా రూ.82 వేలు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.37,500, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.524 మొత్తం రూ.1.20 లక్షల వరకూ లబ్ధి పొందింది. గత ప్రభుత్వ హయాంలో ఈ కుటుంబానికి ఇలా పథకాలు అందలేదు. తమలాంటి పేదలను గుర్తించి, పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా ఉంటామని రంగమ్మ చెబుతోంది. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిదని తెలిపింది.



ఈ ఫొటోలోని మహిళ పేరు రామన్న గారి నాగమణి. పరిగి మండల కేంద్రంలోని బోయపేటలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. ఈమె కుటుంబానికి వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.73 వేలు, జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.1,45,635, వసతి దీవెన ద్వారా రూ.22,800, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.18,750, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.4,745, జగనన్న చేదోడు ద్వారా రూ.20,000, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.24,374, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) ద్వారా రూ.528, వైఎస్సార్ పింఛను కానుక ద్వారా 82,000 ఇలా ఇప్పటి వరకూ మొత్తం రూ.3,91,822 లబ్ధి చేకూరింది. గత పాలనలో ఇలా పథకాలు అందించిన దాఖలాలు లేవని నాగమణి తెలిపింది. జగనన్న చేసిన మేలు మరచిపోలేమని, రుణపడి ఉంటామని చెబుతోంది.



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



లేపాక్షి: పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

- పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి
- సీఎంకు అండగా ఉంటాం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం

లేపాక్షి: సీఎం జగనన్న పాలన అవినీతికి తావులేకుండా పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి. వలంటీర్లు, సచివాలయ అధికారులు ఇళ్ల వద్దకే వచ్చి, సమస్యలు పరిష్కరిస్తున్నారని లబ్ధిదారులు అన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న సీఎం జగనన్నకు మేమంతా అండగా ఉంటామని తెలిపారు. శనివారం ఉదయం మండలంలోని కోడిపల్లి పంచాయతీ పరిధిలోని నాగేపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ.. 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి రావడానికి ఎన్నికలకు ముందు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామంటూ మహిళలను మోసం చేశారన్నారు. దీంతో ఏ గ్రేడ్‌లో ఉండాల్సిన మహిళా సంఘాలు డి.గ్రేడ్‌కు చేరాయని పేర్కొన్నారు. అంతేకాకుండా వడ్డీకి వడ్డీ చెల్లించి అప్పులు పాలయ్యారన్నారు. అయితే జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వడ్డీ మాఫీ చేయడమే కాకుండా , సున్నా వడ్డీ కూడా అమలు చేశారని పేర్కొన్నారు. డీ.గ్రేడ్‌లో ఉన్న సంఘాలు ఏ గ్రేడ్ లోకి వచ్చాయని మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మహిళల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేసి, వారి పురోభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ మాట్లాడుతూ.. ప్రజలు గతంలో సమస్యల పరిష్కారానికి నిత్యం కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా స్థానికంగానే సమస్యలు పరిష్కరించుకుంటున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వాదించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజునాథ్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు అంజినరెడ్డి, మండల కన్వీనర్ నారాయణస్వామి, సింగిల్ విండో అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, పాపన్న, రుద్రప్ప, మూర్తి, శ్రీరాములు, అశోక్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.3.45 కోట్ల మంజూరు

మండలంలోని నాగేపల్లి-కొత్తపల్లి రోడ్డు నిర్మాణానికి రూ.3.45 కోట్ల పంచాయతీ రాజ్ నిధులు మంజూరైనట్లు పీఆర్ డీఈ మల్లికార్జున తెలిపారు. 6 నెలల్లోపు రోడ్డు పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు..

పరిగి: గత మూడేళ్లుగా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని, పాలనలో రాజన్న రాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు తొలుత స్థానిక నాయులు గజమాల వేయగా.. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం బోయపేట, కురుబగేరలో ప్రతి గడపకూ వెళ్లి లబ్ధి పొందిన వివరాలను తెలియజేశారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందించారు.

పాలనలో ఏపీ దేశానికే ఆదర్శం..

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు కుల, మత, రాజకీయ, వర్గ విభేదాలకు తావు లేకుండా అర్హతే ఆధారంగా వర్తింపజేస్తున్నట్లు ఎమ్మెల్యే శంకరనారాయణ తెలిపారు. తన పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకున్న ప్రజల కష్టాలను తీర్చడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, నవరత్నాలతో పేదలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, జగనన్న శాశ్వత గృహహక్కు పథకం తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. డ్రైనేజీ, నీటి సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో వెంటనే పరిష్కరించాలని సర్పంచ్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు లక్ష్మీ, లింగమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి, కో-ఆప్షన్ మెంబర్ సలీం, స్థానిక నాయకులు సురేష్‌రెడ్డి, చంద్రారెడ్డి, సింగారెడ్డి, మైనార్టీ నాయకులు ఇర్షాద్ అహ్మద్, శామీర్, ఎస్సీ సెల్ నాయకులు శివశంకర్, శంకరప్ప, మాజీ ఎంపీపీ గోవిందప్ప, మాజీ కన్వీనర్ జయరాం, డీలర్ మూర్తి, మల్లికార్జున, బీరప్ప, నాగరాజు, సజ్జప్ప, బోయ నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ వెంకటేశులు, వెంకటరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమి పూజ

స్థానిక 40 ఇండ్ల ఎస్సీ కాలనీలో సీఎం డెవలప్‌మెంట్ ఫండ్ రూ.5 లక్షలతో శ్రీరామ దేవాలయానికి సంబంధించి కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు.

పింఛన్‌తో అవ్వాతాతల మోములో చిరునవ్వు





అగళిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పరిగి: అవ్వాతాతల మోములో సంతోషం చూడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును దశల వారీగా పెంచుతున్నారని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. శనివారం స్థానిక బీరప్ప ఆలయ కల్యాణ మండపంలో ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సరస్వతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే శంకరనారాయణ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బాబురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తోందన్నారు. మండలానికి కొత్తగా 266 పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. గతంలో చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు కేవలం రూ.75 మాత్రమే ఇచ్చేవారన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక పింఛన్‌ను రూ.200లు చేసి, అవ్వాతాతలకు అండగా నిలిచారన్నారు. అభివృద్ధే లక్ష్యంగా అవినీతి అక్రమాలకు తావు లేకుండా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల డబ్బు జమ చేస్తున్నారని తెలిపారు. మరో మూడు దశాబ్దాల పాటూ ముఖ్యమంత్రిగా జగనన్నే ఉండాలని ప్రజలు కోరుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి, మాజీ కన్వీనర్ జయరాం, కాణిపాకం ఆలయ ట్రస్టు డైరెక్టర్ మారుతీస్వామి పాల్గొన్నారు.

మడకశిర(అగళి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట తప్పకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. శనివారం అగళి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో పింఛన్ వారోత్సవాల్లో భాగంగా నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్ ఏటా రూ.250 చొప్పున పింఛన్ డబ్బును పెంచుకుంటూ పోతున్నారన్నారు. చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి నడచుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మహేంద్ర, డైరెక్టర్ చంద్రప్ప, వైఎస్సార్ సీపీ నాయకుడు శివన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు కేవలం అర్హతే ప్రామాణికమని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతనంగా మంజూరైన 309 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలంటీర్లు ఇళ్ల వద్దకే వచ్చి అర్హత ఉన్నవారి వివరాలు సేకరిస్తున్నారన్నారు. పింఛన్ మంజూరైన తరువాత ఇళ్ల వద్దకే వెళ్లి, పింఛన్ డబ్బులు అందిస్తున్నారన్నారు. పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, ఎంపీడీఓ రామారావు, సర్పంచులు యంజారేగౌడు, రంగస్వామి, లక్ష్మీనారాయణ, సతీష్, ఎంపీటీసీలు సుశీల, సురేష్, రాజు, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్లు పాండు, సురేష్, నాయకులు శివరాజ్, శివకుమార్, రామచంద్ర, గుప్తా పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల చెరువు వేలం రేపు

గుడిబండ: మండల పరిధిలోని దేవరహట్టి గ్రామ పంచాయతీ ఫళారం చెరువులో చేపల పెంపకానికి ఈనెల 9వ తేదీన దేవరహట్టి సచివాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓఆర్‌డీ నాగరాజు నాయక్, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.5,000 ధరావత్తు చెల్లించాలన్నారు.

11న అగళి చెరువుకు..

మడకశిర(అగళి): అగళి చెరువులో ఏడాది కాలం పాటు చేప పిల్లలను పెంచి అమ్ముకునేందుకు ఈనెల 11న ఉదయం 11 గంటలకు శంకరేశ్వర స్వామి రచ్చకట్ట వద్ద వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి వేణుగోపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అదే విధంగా వేలంపాటలో పాల్గొనే వారికి గ్రామ పంచాయతీకి సంబంధించిన ఎలాంటి బకాయిలు ఉండకూడదని తెలిపారు.

ఆర్బీకే తనిఖీ

మడకశిరరూరల్: మండల పరిధిలోని బుళ్లసముద్రం గ్రామంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారి వీర నరేష్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఆర్బీకే సేవలను అందించాలని సిబ్బందికి సూచించారు. రబీ సీజన్‌లో పంటల సాగు, నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాయితీలు అర్హత గల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీ కొడిగేపల్లిలో 104 సేవలు

మడకశిరరూరల్: మండల ప్రజలు 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్ మాధుర్య తెలిపారు. శనివారం సీ కొడిగేపల్లి గ్రామంలో 104 సిబ్బంది వైద్య సేవలందించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి, మందులు అందజేశారు. అదే విధంగా ఫ్యామిలీ డాక్టర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించడానికి ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని వైద్య సిబ్బంది పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పావగడ: 'నమ్మ పావగడ నమ్మ హక్కు' అనే పేరుతో రూపొందించిన క్యాలెండర్లను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ అజయ్ సారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నమ్మ పావగడ నమ్మ హక్కు' యాప్ ద్వారా ప్రజల నుంచి ఎంతో సమాచారం అందుకుని మట్కా, పేకాట జూదాల నివారణకు చర్యలు చేపడుతున్నామన్నారు. జూదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో క్యాలెండర్లను ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో డీజీఎస్ నారాయణప్ప, కన్మేడి కృష్ణమూర్తి, రమేష్, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు బేకరి నాగరాజు, ఆటో డ్రైవర్లు చిరంజీవి, శమి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



నృత్యం చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పెనుకొండ: తెలుగు సంస్కృతికి సంక్రాంతి నిలువెత్తు నిదర్శనమని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అధ్యాపకులు విద్యార్థులతో కలసి ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నారు. కనుమ, భోగి, సంక్రాంతి పర్వదినానికి సంబంధించి ముగ్గులు వేయడం, గొబ్బెమ్మల అలంకరణ, భోగి మంటల నిర్వహణ కార్యక్రమాలు అలరించాయి.

కాంగ్రెస్ సభకు తరలిరండి

పావగడ: చిత్రదుర్గంలో ఆదివారం జరిగే ఎస్సీ, ఎస్టీ వర్గాల కాంగ్రెస్ మహాసభకు తాలూకాలోని ఎస్సీ, ఎస్టీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప శనివారం ఓ ప్రకటనలో కోరారు. తాలూకా వ్యాప్తంగా పట్టణంతో చేరి 34 గ్రామ పంచాయతీలకు మొత్తం 50 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య తదితర ప్రముఖ నాయకులు హాజరవుతారన్నారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ పాల్గొనే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

9న 'పురం' పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ సమీక్ష

హిందూపురం టౌన్: పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్ హాలులో ఈ నెల 9న హిందూపురం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు సుధాకర్, ఏఐసీసీ మెంబర్ కేటీ శ్రీధర్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ సమీక్షకు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ఇన్‌చార్జ్ మైయప్పన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హరిత, జమీల్, యూనూస్, రఫిక్, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి

అమరాపురం: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో శనివారం గురుస్వామి రామంజనేయులు ఇరుముడి కార్యక్రమాన్ని ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వాములు ఇరుముడితో శబరిమలైకు తరలివెళ్లారు.

సంక్షిప్త సమాచారం

అనారోగ్యంతో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



జనార్ధన్ (ఫైల్)

గోరంట్ల: మండల పరిధిలోని శింగిరెడ్డిపల్లికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ జనార్ధన్ (35) హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. మృతుడికి భార్య గౌతమి, ఓ కుమార్తె ఉన్నారు. ఆదివారం మృతదేహాన్ని శింగిరెడ్డిపల్లికి తీసుకొస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

హిందూపురం: మండలంలోని పూలకుంట జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న బి.భైరవమూర్తి రాష్ట్ర స్థాయి త్రోబాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రమౌళీశ్వర, ఫిజికల్ డైరెక్టర్ జగదీష్ శనివారం తెలిపారు. ఈనెల 11, 23 తేదీల్లో కాకినాడ, నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో భైరవమూర్తి పాల్గొంటాడన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

చిలమత్తూరు: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం రాత్రి కొడికొండ చెక్‌పోస్ట్ 44వ నంబరు జాతీయ రహదారిపై వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఆలిండియా అథ్లెటిక్ మీట్‌కు ఎంపిక



విద్యార్థి చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న కళాశాల కమిటీ సభ్యులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలకు చెందిన బీకాం మొదటి సంవత్సరం విద్యార్థి చంద్రశేఖర్ ఆలిండియా అథ్లెటిక్ మీట్‌కు ఎంపికయ్యాడు. గత నెలలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్‌లో చంద్రశేఖర్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి చెన్నైలోని తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరిగే ఆలిండియా అథ్లెటిక్ మీట్‌లో వంద, రెండు వందల మీటర్లు రిలే పరుగు పోటీల్లో పాల్గొంటాడని కళాశాల అధ్యక్షుడు చంద్రమోహన్ తెలిపారు. కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, పీడీ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

హిందూపురం: మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మించిన కమర్షియల్ కూరగాయల మార్కెట్ బిల్డింగ్‌లో సౌకర్యాలు కల్పించాలని వ్యాపారులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వ్యాపారుల సంఘం నాయకులు సూర్యనారాయణ, రాము, రెహమాన్ విలేకరులతో మాట్లాడారు. 150 మంది వ్యాపారులు మార్కెట్‌లోని గదులను అద్దెకు తీసుకుని, గుడ్‌విల్ రూ.2 లక్షల వరకూ చెల్లించామన్నారు. వెంటనే తోపుడుబండ్లు, గంపల వ్యాపారాలను మార్కెట్‌కు దూరంగా తరలించాలన్నారు. కాయగూరలు, పండ్లు, పూలు అన్ని మార్కెట్‌లోనే విక్రయాలు సాగించేలా చూడాలని కోరారు. మార్కెట్‌లో సెక్యూరిటీ , ఇతర సదుపాయాలు కల్పించాలన్నారు.

అనుమతి లేకుండా సూపర్ మార్కెట్ నిర్వహించొద్దు



రొళ్ల గురుకుల పాఠశాలలో భోజన నాణ్యతపై ఆరా తీస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్

రొళ్ల: ప్రభుత్వ అనుమతి పొందకుండా సూపర్ మార్కెట్ నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీమ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డు పక్కన నిర్వహిస్తున్న మారుతి సూపర్ మార్కెట్‌ను తనిఖీ చేశారు. తొలుత దొమ్మరహట్టి సమీపంలోని డాక్టర్ బాలయేసు గురుకుల పాఠశాలను సందర్శించారు. భోజనం నాణ్యత, పరిశుభ్రతపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలం చెల్లిన నిత్యావసర సరుకులతో తయారు చేసిన పదార్థాలను ప్రజలకు విక్రయించరాదన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యతతో కూడిన సరుకులు, పదార్థాలను విక్రయించాలన్నారు. మారుతి సూపర్ మార్కెట్ నిర్వహణకు అనుమతి తీసుకోకపోవడంతో యజమానికి నోటీసులు జారీ చేశారు. వెంటనే అనుమతి తీసుకోకపోతే సూపర్ మార్కెట్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గోరంట్ల: నార్శింపల్లి పంచాయితీ పరిధిలోని యర్రపల్లి, నార్శింపల్లి గ్రామాల్లో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో యర్రపల్లిలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

10 నుంచి బీజీహళ్లి సచివాలయం పరిధిలో..

రొళ్ల: బీజీ హళ్లి సచివాలయం పరిధిలో ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు శనివారం తెలిపారు. 10వ తేదీన బీజీ హళ్లి, 11వ తేదీన మల్లసముద్రం, అగ్రహారం, 12వ తేదీన జీజీ హట్టి, టీడీ పల్లిలో నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారన్నారు.

ఎమ్మెల్సీ వ్యక్తిగత కార్యదర్శిగా జయరామిరెడ్డి

హిందూపురం: ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ వ్యక్తిగత కార్యదర్శిగా కదిరి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న జయరామిరెడ్డిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ప్రభుత్వ పరమైన నివేదికలు, ఉత్తర ప్రత్యుత్తారాలు ఇలా అన్ని కార్యక్రమాల్లో ఎమ్మెల్సీకి సహాయకారుడిగా వ్యవహరిస్తారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లి గేట్ నుంచి శనివారం అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి భక్తులు

పెనుకొండ: ఇటీవల సత్యసాయి బాలవికాస్ ఆధ్వర్యంలో సత్యం, ధర్మం, ప్రేమ, మానవతా విలువలపై పట్టణంలోని సత్యసాయి డిగ్రీ, జూనియర్ కళాశాల, బ్రిలియన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు పోటీలు నిర్వహించిన విషయం తెలిసిందే. శనివారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయా కళాశాలలు, స్కూల్‌లో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా బాలవికాస్ కార్యదర్శి రాజేంద్ర, అధ్యాపకులు మహేష్, కేశవయ్య, శ్రీరాములు, పార్వతమ్మ, రంగనాథ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాబయ్య దర్గాలో ప్రార్థనలు



చదివింపులు చేయిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ శనివారం పెనుకొండ బాబయ్య దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు ఆమెను సాదరంగా ఆహ్వానించి, చదివింపులు చేశారు. అనంతరం చైర్‌పర్సన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బనద పున్నమి



నిమ్మకాయల అలంకరణలో బనశంకరి

పావగడ: బనద (వనం) పున్నమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక బనశంకరి దేవాలయంలో అమ్మవారికి శనివారం వైభవంగా పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారు నిమ్మకాయల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా ఆదర్శ నగర్‌లోని గంగమ్మ దొణ వద్ద వెలసిన సద్గురు భం భం బాబా దేవాలయంలో సైతం బనద పున్నమి వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ అధ్యక్షురాలు ధనలక్ష్మి, కౌన్సిలర్లు పి.రాజేశ్, టెంకాయల రవి, సుదేశ్ బాబు, విజయకుమార్ తదితరులు భం భం బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జేడీఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న నాయకులతో ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: తాలూకాలోని బళసముద్రం గ్రామానికి చెందిన జేడీఎస్ నాయకులు రామలింగ, మాధవ రాజు, రామాంజినేయ, గోవిందప్ప తదితరులు జేడీఎస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. శనివారం ఎమ్మెల్యే వెంకటరమణప్ప ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటరమణప్ప చేపడుతున్న అభివృద్ధి పనులు, అతని కుమారుడు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హెచ్ వి వెంకటేశ్ పేదలపై చూపుతున్న ఆదరాభిమానాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు జేడీఎస్ నాయకులు తెలిపారు.

వీధులను శుభ్రంగా ఉంచాలి

రొళ్ల: గ్రామాల్లో వీధులను శుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ కిష్టప్ప సూచించారు. శనివారం మండల పరిధిలోని గుడ్డగుర్కి పంచాయతీ కేంద్రంలోని చెత్త నుంచి సంపద తయారి కేంద్రాన్ని సందర్శించారు. తర్వాత సచివాలయంలో కార్మికులతో మాట్లాడారు. ప్రజల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అలాగే వీధులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిద్దాలన్నారు. ఎరువులను తయారు చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

శుద్ధమైన నీటిని తాగాలి



నీటి పరీక్షపై అవగాహన కల్పిస్తున్న జేజేఎం సభ్యులు

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం జేజేఎం కమిటీ సభ్యులు నీటి పరీక్షను ఏ విధంగా చేయాలి అనే అంశంపై అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు కలీముల్లా మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు శుద్ధమైన నీటిని తాగాలన్నారు. బోరుబావిలోని నీటిని తీసుకొచ్చి ఫిల్టర్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీలు నీటి పరీక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.